ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024



జిల్లావ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్‌ల ఏర్పాటు

కలెక్టరేట్, ఏప్రిల్ 30: జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు.. ఓటుహక్కు వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పలాసలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాతపట్నంలో ఆదర్శ పాఠశాల, ఆమదాలవలసలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎచ్చెర్లలో పోలీసుక్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట, టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశాం. మే 4 నుంచి 7వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయి' అని కలెక్టర్ తెలిపారు.

ప్రజాగళం

ఉమ్మడి మేనిఫెస్టో - 2024



ప్రజాగళం అదుర్స్

- ఉమ్మడి మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని ప్రజల ఆకాంక్ష

(ఆంధ్రజ్యోతి - శ్రీకాకుళం)

టీడీపీ-జనసేన-బీజేపీ ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంగళవారం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్, బీజేపీ నేతలు ఈ మేనిఫెస్టో విడుదల చేశారు. అటు నిరుద్యోగుల నుంచి ఉద్యోగుల వరకూ.. ఇటు విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులకు.. మరోవైపు రైతులకు, కార్మికులకు.. ఇలా అన్నివర్గాలకూ ఆమోదయోగ్యంగా ఉండేలా మేనిఫెస్టో రూపొందించారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు అందిస్తూనే.. పారిశ్రామిక ప్రగతి, ఉపాధి మార్గాలు పెంచేలా.. భవిష్యత్‌కు భరోసా నింపేలా ఉందని పేర్కొంటున్నారు. ఇది సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యగులకు సైతం మేలు కలిగేలా ఉందని అభివర్ణిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని గాడిన పెట్టాలని కోరుతున్నారు.





నేడు కార్మిక దినోత్సవం

కార్మికులకూ.. వంచనే

- సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
- సమస్యలపై పోరాడితే.. గొంతు నొక్కిన వైనం
- సీఎం వైఎస్ జగన్ హామీలకు తిలోదకాలు

(ఆమదాలవలస/రణస్థలం)

మేడే.. అంటే కార్మికులకు పండుగ దినం. కార్మికుల శ్రమ, వారి అంకితభావం గుర్తించేలా.. ఏటా మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం నిర్వహిస్తారు. కాగా.. వైసీపీ పాలనలో కార్మికుల హక్కుల కాలరాయడం.. శ్రమ దోపిడీకి పాల్పడడం.. ఉపాధి అవకాశాలు లేక.. కార్మికుల్లో సంతోషం కరువవుతోంది. హక్కుల కోసం ప్రశ్నిస్తే.. గొంతునొక్కడం పరిపాటిగా మారింది. బుధవారం మే డే(కార్మికుల దినోత్సవం) సందర్భంగా ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే.. వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు పరిశ్రమలు లేవు. మరోవైపు సిమెంట్, ఇసు క, ఐరన్ ధరలు భారీగా పెంచేయడంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. దీంతో కార్మికులు ఉపాధి కోసం వలసబాట పట్టాల్సిన దుస్థితి నెలకొంది. గత ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ కార్మికులకు కల్లబొల్లి కబుర్లు చెప్పారు. తాము అధికారంలోకి వస్తే 'సమాన పనికి సమాన వేతనం అందజేస్తాం. ఉద్యో గ భద్రత కల్పిస్తాం. వేలాది మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. సమస్య లను పరిష్కరిస్తాం' అంటూ హామీలిచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలేవీ సక్రమంగా నెరవేర్చ లేదు. ఈ ఐదేళ్లలో కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్న పరిశ్రమలు కొన్ని మూతపడ్డాయి.



ఆమదాలవలసలో విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికులు

కార్మికుల బతుకులు రోడ్డునపడ్డాయి. అలాగే పారిశుధ్య కార్మికులను సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. హామీల అమలు, సమస్యల పరిష్కారం కోసం వారు సమ్మెబాట పట్టగా.. వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది.

● కనీస సౌకర్యాలు లేవు..

జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు సుమారు లక్ష మంది ఉన్నారు. వ్యవసాయ, భవన నిర్మాణం, చేనేత, ఉపాధిహామీ వేతనదారులు, చేతివృత్తుల వారు, హమాలీలు తదితరులు ఈ కోవలోకి వస్తారు. కార్మిక శాఖ గుర్తించింది మాత్రం 25వేల లోపే. వీరికి ప్రత్యేక సంక్షేమ పథకాల మాట దేవుడెరుగు. కనీసం సౌకర్యాలు కూడా అందడం లేదు. ఇతర సంక్షేమ పథకాలతో ముడిపెట్టి, నిధులను మళ్లిస్తున్నారు. రణస్థలం మండలం పైడిభీమవరంలో సుమారు 15 పరిశ్రమలు ఉన్నాయి. సుమారు 18 వేల కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మిక శాఖ అధికారాలకు ప్రభుత్వం కత్తెర వేసింది. ప్రైవేటు యాజమాన్యాలకు మితిమీరిన మినహాయింపులు ఇచ్చారు. దీంతో ప్రైవేటు కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ అనుమతి లేనిదే కిందిస్థాయి అధికారి పరిశ్రమలను తనిఖీ చేయలేని పరిస్థితి ఉండడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి ఉంది.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చిస్తున్న దృశ్యం (ఫైల్)

● తెరచుకోని చక్కెర కర్మాగారం

ఆమదాలవలస నియోజకవర్గంలోని చక్కెర కర్మాగారం, కాన్‌కాస్ట్ ఫ్యాక్టరీ జూట్‌మిల్లులు, పలు చిన్న తరహా పరిశ్రమలు వివిధ కారణాలతో మూతపడ్డాయి. వేలాది మంది కార్మిక కుటుంబాలు ఉపాధి లేక అల్లాడిపోతున్నాయి. ఆమదాలవలసలో దశాబ్దాల చరిత్ర కలిగిన చక్కెర కర్మాగారం ఒకప్పుడు సుమారు 700 మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి కల్పించేది. నష్టాల కారణంగా 2004లో ఈ కర్మాగారం మూతపడడంతో రైతులకు, కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థకు ఈ కర్మాగారాన్ని విక్రయించారు. కొందరు షేర్‌హోల్డర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కర్మాగారాన్ని సహకార సంఘాలు నడిపించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. కానీ పరిశ్రమ మాత్రం తెరచుకోలేదు. ఐదేళ్ల కోసారి ఎన్నికల వేళ.. ఈ కర్మాగారాన్ని తెరిపిస్తామని నాయకులు హామీలిస్తున్నారు. కానీ, ఎన్నికల తర్వాత దీని ఊసే మరచిపోతున్నారు. 2019లో ఆమదాలవలసలో పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. తాము అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. కానీ, నేటికీ హామీ నెరవేరలేదని రైతులు, కార్మికులు వాపోతున్నారు.

దీంతో కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. కార్మిక రక్షణ లేకుండా పోతోంది. అలాగే నిబంధనల మేరకు పరిశ్రమల యాజమాన్యాలు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.



● ఆ పథకాలకు మంగళం

వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరు చెప్పి.. కార్మికుల పథకాలను నిలిపేసింది. అన్ని ప్రయోజనాలను వైఎస్సార్ బీమా, పెళ్లి కానుక, ఆరోగ్యశ్రీ వంటి సాధారణ పథకాలతో ముడిపెట్టి ఆపేసింది. ఫలితంగా కార్మిక సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో కార్మిక సంక్షేమ నిధులకు సంబంధించి కార్మిక కుటుంబాల్లో ఎవరికైనా పెళ్లి జరిగితే రూ.20 వేలు, డెలివరికి రూ.20వేలు, ఇంటర్, ఆపై చదివిన విద్యార్థులకు ఏడాదికి రూ.10వేల వరకూ స్కాలర్‌షిప్‌లు అందేవి. అనారోగ్యానికి సంబంధించి మేజర్ ఆపరేషన్లకు రూ.50వేలు, దీర్ఘకాలిక వ్యాధులు, గుండెజబ్బులు ఉన్న కార్మికులకు ఏడాదికి రూ.20వేలు సాయం అందించేవారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో దాదాపు రూ.400 కోట్ల కార్మిక సంక్షేమ నిధిని పక్కదారి పట్టించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.



ఉపాధి కోసం ఎదురుచూస్తున్నా...

వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేవు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. గత ఐదేళ్లలో ఆర్టీసీలో ఎటువంటి నియామకాలు చేపట్టలేదు. మెరుగైన ఉపాధి అవకాశాలు కోసం ఎదురుచూస్తున్నాను.

-మండ వెంకటరావు, నిరుద్యోగి, నందికొండ కాలనీ, సరుబుజ్జిలి



కార్మికులకు ఇబ్బందులే..

వైసీపీ పాలనలో ఇసుక కొరతకు భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారు. టీడీపీ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు బీమా వర్తించేది. ఉచిత ఇసుక కారణంగా ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

-ముంజి లక్ష్మీనారాయణ, సరుబుజ్జిలి



బలవంతపు రిటైర్మెంట్ ఆపాలి..

30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని కార్మికులకు బలవంతపు రిటైర్మెంట్ చేయిస్తున్నారు. దీనివల్ల ఇప్పటివరకూ 60 మంది కార్మికులు వీధిన పడ్డారు. 12 ఏళ్ల సర్వీసు ఉన్నా తొలగించడం అన్యాయం. 58 ఏళ్ల పూర్తయితేనే రిటైర్మెంట్ చేయాలని జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు బలవంతపు రిటైర్మెంట్‌లు నిలిపేయాలి.

-సీహెచ్ అమ్మన్నాయుడు, సీటూ నాయకుడు



స్థానికులకు ఉపాధి కల్పించాలి..

స్థానికంగా పరిశ్రమలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థానిక యువతకు ఉపాధి దొరకడం లేదు. పరిశ్రమల్లో పనిచేసేందుకు పూర్తి స్థాయి అర్హత ఉన్నా.. యువతీ, యువకులకు ఉపాధి ఉండడం లేదు. 75శాతం స్థానిక ఉపాధి ఎక్కడా అమలు కాలేదు. చాలీచాలని జీతాలతో కార్మికులు దుర్భరమైన జీవితాలు వెల్లబుచ్చుతున్నారు.

- పి.తేజేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు

తెరిచినట్లే తెరిచి..

- మూతపడిన మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమ
- ఉపాధికి దూరంగా 700 కుటుంబాలు

టెక్కలి: టెక్కలి డివిజన్ కేంద్రం రావివలసలో 1989లో శారద ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను స్థాపించారు. ఈ పరిశ్రమలను కొన్నాళ్ల జీఎంఆర్, ఆ తర్వాత మెట్‌కోర్ ఎల్లాయిస్ లిమిటెడ్ సంస్థ నడిపించింది. మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమ నష్టాల్లో ఉందంటూ అప్పటి యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. దీంతో రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే సుమారు 700 మంది కార్మికులు ఉపాధి కోల్పోయామంటూ రోడ్డెక్కారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా ఆ ప్రాంతంలో పర్యటించగా.. కార్మికులకు తమ సమస్యను వివరించారు. తాను అధికారంలోకి వస్తే పరిశ్రమను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పిస్తానని జగన్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ మేరకు 2021 డిసెంబరు 1న ముంబైకి చెందిన అబిజిత్ అనే పారిశ్రామిక వేత్త ఈ పరిశ్రమను తెరిచి కొద్దిరోజులు నడిపించారు. తర్వాత చడీచప్పు డు లేకుండా పరిశ్రమ మూసివేశారు. దీంతో కార్మికులంతా మళ్లీ ఆందోళన బాట పట్టారు. బకాయిలు చెల్లిస్తూ.. పరిశ్రమ తెరిపించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ తెరిపించి.. కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న సీఎం జగన్ హామీ గాలిలో కలిసి పోయిందని ఆరోపిస్తున్నారు.



రావివలసలో మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమ వద్ద కార్మికుల ఆందోళన (ఫైల్)

వడదెబ్బకు గురై ఇద్దరి మృతి

టెక్కలి/ పలాస రూరల్, ఏప్రిల్ 30: జిల్లాలో వడదెబ్బకు గురై ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన పోలాకి రామారావు(70) అనే రైతు.. మంగళవారం పొలానికి వెళ్లి నువ్వుచేను ఆరబెట్టాడు. ఆ సమయంలో ఎండ తీవ్రతకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామారావు మృతితో భార్య తులసమ్మ, ముగ్గురు కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు. బన్నువాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

● పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన పొందర బలరామ్(85) వడదెబ్బకు గురై మృతి చెందాడు. బలరామ్‌కు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. కుమారులిద్దరూ బ్రాహ్మణతర్లాలోనే కుందరవీధిలో ఒకరు.. శివారు ప్రాంతంలో మరొకరు నివాసం ఉంటున్నారు. ఆదివారం చిన్న కుమారుడు దామోదర్ ఇంటి నుంచి.. పెద్దోడు సుభాష్ ఇంటికి బలరామ్ బయలుదేరి వెళ్లాడు. మధ్యదారిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురై పడిపోయాడు. కాగా.. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియలేదు. అన్నయ్య ఇంట్లో తండ్రి ఉన్నాడని తమ్ముడు.. తమ్ముడు ఇంట్లో తండ్రి ఉన్నాడని అన్నయ్య భావించారు. కాగా.. మంగళవారం ఉదయం కేదారిపురానికి చెందిన కొంతమంది రైతులు పొలంగట్టుపై నిర్జీవంగా పడి ఉన్న బలరామ్‌ను గుర్తించారు. వడదెబ్బకు గురై వృద్ధుడి మృతి చెందినట్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో.. దామోదర్, సుభాష్ అక్కడకు చేరుకున్నారు. తమ తండ్రి వడదెబ్బకు గురై మృతి చెందాడని కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.



చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రాధిక

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాధిక ఆదేశించారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పురుషోత్తపురం చెక్‌పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్నికల వేళ.. నగదుతోపాటు మద్యం, సారా, గంజాయి అక్రమ రవాణా అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అలాగే ఇచ్ఛాపురంలోని ఏఎస్‌పేట, బెల్లుపడలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి, సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, ఎస్ఐ సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టి

- స్పష్టం చేసిన పరిశీలకులు

కలెక్టరేట్, ఏప్రిల్ 30: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల రోజువారీ ప్రచార వ్యయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు శరవణ కుమార్, కోమల్‌జిత్ మీనా, నవీన్ కుమార్ సోనీ.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థుల తుది జాబితా తయారైన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సాధారణ పౌరులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థుల ఖర్చులను చూపడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రికార్డుల నిర్వహణలో పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. మద్యం అమ్మకాలు, షాపులకు వెళ్లే సరకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. జీఎస్టీ సిబ్బంది పన్ను సంబంధిత ప్రయోజనాల కోసం మాత్రమే కాకుండా, ఓటర్లకు పంపిణీ చేసేందుకు పెద్ద ఎత్తున జరిగే వస్తువుల కొనుగోళ్ల లావాదేవీలను కూడా పరిశీలించాలని తెలిపారు.

సమావేశంలో సీపీవో ప్రసన్నలక్ష్మి, జీఎస్టీ ఏసీ రాణీమోహన్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ఎస్ఈబీ ఏఎస్పీ డి.గంగాధరం, ఎక్సైజ్ ఈఎస్ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు



ఓ చేత్తో సాయం మరో చేత్తో బాదుడు

- వైసీపీ పాలనపై గుర్రుమంటున్న ఆటో డ్రైవర్లు

(ఇచ్ఛాపురం)

ఆటో డ్రైవర్లు కూడా వైసీపీ పాలనపై గుర్రుమంటున్నారు. సీఎం జగన్ వాహన మిత్ర పథకం ద్వారా ఓ చేత్తో సాయం చేసి.. మరోచేత్తో జరిమానాలు, వివిధ పన్నుల పేరిట దానికి పదిరెట్లు నగదు లాగేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో ఆటోడ్రైవర్‌కు 'వాహన మిత్ర' కింద ఏడాదికి రూ.10వేలు అందజేస్తోంది. వివిధ నిబంధనలతో లబ్ధిదారుల జాబితాను వడబోసింది. సొంత ఆటో ఉన్నవారికి మాత్రమే.. ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. కాగా.. మరోవైపు టీడీపీ ప్రభుత్వ హయాంలో కన్నా.. ఈ ఐదేళ్లలో జరిమానాలు భారీగా పెంచేసింది. గతంలో వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.130 జరిమానా విధించేవారు. ప్రస్తుతం కనిష్ఠ ధర రూ.1,030కి పెంచేశారు. గతంలో మాదిరి ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఫొటోలు తీసి.. అప్‌లోడ్ చేసి.. ఆన్‌లైన్‌లో చలానాలు పంపిస్తున్నారు. వాటిని చూసి ఆటోడ్రైవర్లు లబోదిబోమంటున్నారు. నెలకు మూడు.. నాలుగు జరిమానాలు విధిస్తున్నారని పేర్కొంటున్నారు. కనీసం నెలకు ఒక జరిమానా విధించినా.. ఏడాదికి తాము రూ.12వేలకుపైగా తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపిందని పేర్కొంటున్నారు. ఇన్స్యూరెన్స్ చార్జీలు తగ్గించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.



నష్టమే ఎక్కువ

వాహన మిత్ర అంటూ ఏడాదికి రూ.10వేలు ప్రభుత్వం ఇస్తోంది. ఏడాదిలోపు ఏదో ఒక రూపంలో జరిమానాలు వేసి తిరిగి తీసుకుంటోంది. దీంతో వచ్చిన లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటోంది.


- మోహన్, ఆటో డ్రైవర్, ఇచ్ఛాపురం



తప్పు లేకుండా చలానాలు

ప్రభుత్వం మా తప్పు లేకుండా ఆటోలకు ఫొటోలు తీసి.. చలానాలు విధిస్తోంది. జరిమానాలు వేస్తున్నట్లు మాకు తెలియదు. ఇన్స్యూరెన్స్ కట్టడానికి వెళ్లేటప్పుడు జరిమానా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అయోమయం చెందుతున్నాం.

- విజయ్, ఆటో డ్రైవర్, ఇచ్ఛాపురం



ఎడమ చెంపపై కూడా సిరా గుర్తు పెడతారు

మీకు ? తెలుసా

గార: వాస్తవానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎడమచేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. దొంగ ఓట్లు, రెండోసారి ఓట్లు నివారించేం దుకు ఈసీ ఈ విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఎవరికైనా చూపుడు వేలు లేకుంటే అటువంటి వారికి మధ్య వేలికి సిరాగుర్తు వేయవచ్చు. ఆ వేలూ లేకుంటే ఉంగరం వేలు లేదా చిటికన వేలు, చివరకు నాలుగు వేళ్లూ లేకుంటే బొటన వేలుకు సిరా గుర్తుపెడతారు. ఒకవేళ ఎడమ చెయ్యి లేకుంటే ఆ ఓటర్లకు కుడిచేతికి ఇదే క్రమంలో సిరా గుర్తు వేస్తారు. రెండు చేతులకు వేళ్లు లేకపోతే అటువంటి వారికి వేళ్ల మొదలు లేదా మధ్యభాగం లేదా చేతిపై గుర్తు వేస్తారు. భుజాల వరకు చేతులులేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరా గుర్తు పెడతారు.

గెలుపు కోసం..
వైసీపీ కుయుక్తులు

- ప్రచారానికి రావాలని వలంటీర్లపై ఒత్తిడి
- బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్న వైనం
- చేయని వారికి బెదిరింపులు
- పార్టీ కేడర్‌ను నమ్ముకుంటే గెలవలేమనే బెంగ
- అందుకే వలంటీర్లతో ప్రచారం
- అయినా నమ్మని ప్రజలు

(మెళియాపుట్టి)

జిల్లాలో 12,500 మంది వలంటీర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 3,800 మంది వరకు రాజీనామాలు చేసినట్లు తెలు స్తోంది. మెళియాపుట్టి మండలంలో 303 మంది వలంటీర్లు ఉండగా ఎనిమిది మంది మాత్రమే రాజీనామాలు చేశారు. దీంతో వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి తీసుకురా వడంతో గత సోమవారం 47 మంది వరకు రాజీనామా చేయడానికి ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో వలంటీర్లను రాజీనామాలు చేయించాలని రెండు రోజులుగా వైసీపీ నాయకులు ఒత్తిడి తీవ్రత పెంచారు. రాజీనామాల కోసం కొంత మంది వైసీపీ నాయకులు అప్పట్లో వారికి సిఫారసు చేసిన వారితో పాటు బంధువులు, కుటుంబసభ్యులతో చెప్పి ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రచారానికి స్పందన లేక..

వైసీపీ నాయకులు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించే సమయంలో ప్రజల నుంచి స్పందన ఉండడం లేదు. దీంతో వలంటీర్లను రంగంలోకి దించుతున్నారు. అయితే కొంతమంది వలంటీర్లు రాజీనామా చేయ కుండానే బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఎటు వంటి వివాదాలు తలెత్తకూడదన్న ఉద్దేశంతో రాజీనామాలు చేసి ప్రచారానికి రావాలని వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి పెంచారు. బరిలో ఉన్న వైసీపీ అభ్యర్థులు వలంటీర్లను నమ్ముకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. కానీ, ప్రజలు మాత్రం నమ్మడం లేదు. ఈ ఐదేళ్లలో తాము పడిన ఇబ్బందులు చాలని, ఇక జగన్‌ను నమ్మేది లేదని ప్రచారానికి వచ్చిన వైసీపీ నాయకులకు తేల్చి చెబుతున్నారు.

గుర్రుగా వైసీపీ కేడర్..

రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు వారధులుగా వీరిని పట్టణాలు, గ్రామాల్లో 50 కుటుంబాలకు ఒకరిని చొప్పున నియమించింది. గతంలో ఏదైనా ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తే అందులో తమ ప్రజాప్రతినిధులు, కేడర్‌ను భాగస్వాములను చేసేది. దీంతో వారు పథకాల గురించి ప్రజలకు వివరించేవారు. దీనివల్ల వారితో నేరుగా సత్సంబంధాలు ఉండేవి. అయితే, వైసీపీ మాత్రం కేడర్‌ను కాదని వలంటీర్లతోనే ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు చేర వేసేలా చేసింది. అయితే, తమను పక్కన పెట్టి వలంటీర్లకు అధికారాలు కట్టబెట్టడంపై పార్టీ కేడర్ గుర్రుగా ఉంది. వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు, పార్టీ క్యాడర్‌కు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని వైసీపీ నాయకులే అభిప్రాయపడుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో కేడర్ చెబితే ప్రజలు ఓటు వేయరని చెప్పి వలంటీర్లను రంగంలోకి దించుతున్నారు. వలంటీర్లను ప్రచారానికి తీసుకుచ్చేందుకు వైసీపీ నాయకులు పాట్లు పడుతున్నారు. వారితో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. వినని వారిని బెదిరిస్తు న్నారు. కొంత మంది వలంటీర్లు భయపడకుండా వైసీపీ నాయకులకు ఎదురు తిరుగుతున్నారు. రాజీనామాలు చేయబోమని తెగేసి చెబుతున్నారు. కాగా, ఈ ఐదేళ్లలో కొన్నిచోట్ల కొంతమంది వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా ప్రజలపై అరాచకాలకు పాల్పడ్డారు. దీంతో ప్రస్తుతం ఆ నాయకులు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అందుకే వలంటీర్లతో ప్రచారం చేయాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి.


మెళియాపుట్టిలో వైసీపీ నాయకుల ప్రచారంలో కానరాని జనాలు

కార్యకర్తలపై నమ్మకం లేకనే..

ఏదైనా భవనం పటిష్ఠంగా ఉండాలనే పునాది బలంగా ఉండాలి. ఆ సూత్రం రాజకీయ పార్టీలకు సైతం వర్తిస్తుంది. పార్టీలు సంస్థాగతంగా బలంగా ఉండాలంటే కార్యకర్త వ్యవస్థ కీలకం. కొన్ని పార్టీలు పదేళ్ల పతిపక్షంలో ఉన్నా నేటికీ అవి చెక్కుచెదరకుండా బలంగా ఉన్నాయి. దీనికి కారణం కార్యకర్తలే. అటువంటి వ్యవస్థను తమ పార్టీ నిర్మించుకోలేదని వైసీపీ నాయకులే చెబుతున్నారు. తన తండ్రి మరణానంతరం జగన్ సీఎం పదవిని ఆశించారు. ఆ పదవి రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి సొంతంగా వైసీపీని ఏర్పాటు చేశారు. కానీ, బలమైన కేడర్‌ను నిర్మించుకునేందుకు ఏనాడు దృష్టిపెట్టలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కార్యకర్తలను విస్మరించారు. కేవలం మండలానికి ఇద్దరు, ముగ్గురికే ప్రాధాన్యం ఇచ్చి వారినే ప్రోత్సహించారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. దీంతో వైసీపీకి కార్యకర్తలు దూరమయ్యారు. ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం కార్యకర్తల కంటే వలంటీర్లకే ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం అన్ని పథకాలు వలంటీర్ల చేతుల మీదుగానే అమలు జరుగు తుండడంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వెళ్తున్నా ప్రజల నుంచి స్పందన రావడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనించిన వైసీపీ నాయకత్వం ఎలాగైనా వలంటీర్లతో రాజీనామా చేయించి ఎన్నికల ప్రచారానికి వినియోగించుకోవాలని నిర్ణయానికి వచ్చింది. వారు ప్రచారానికి రాకుంటే అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపుతుందని కొందరు నాయకులు బాహటంగా చెబుతున్నారు.


ఇంతకన్నా ఇంకేం కావలి!

అరుదైన అవకాశం

- ఒకే ఇంట్లో నలుగురు ఎమ్మెల్యేలు
- వేర్వేరు నియోజకవర్గాల నుంచి కావలి కుటుంబ సభ్యులు ప్రాతినిధ్యం

రణస్థలం: ఒకే వ్యక్తి నాలుగైదు సార్లు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికకావడం చూశాం. కానీ, ఒకే ఇంట్లో నలుగురు వ్యక్తులు ఎమ్మెల్యేలుగా పని చేయడం అరుదు. అటువంటి అరుదైన అవకాశం ఉమ్మడి జిల్లాలోని కావలి కుటుంబ సభ్యులకు దక్కింది. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1983 నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కావలి ప్రతిభాభారతి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి, స్పీకర్‌గా పనిచేశారు. ఆమె తండ్రి కొత్తపల్లి పున్నయ్య పొందూరు, చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు తొలినాళ్లలో ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఎమ్మెల్యేగా ఉంటూనే శ్రీకాకుళం జడ్పీ వైస్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. ఎమ్మెల్యేగా ఉండగానే జిల్లా జడ్జిగా ఎన్నికయ్యారు. పున్నయ్య హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. పున్నయ్య సోదరుడు కొత్తపల్లి నరసయ్య 1972లో పాలకొండ నుంచి, 1978లో ఎచ్చెర్ల నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రతిభాభారతి తాత కావలి నారాయణ శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 1955లో శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రతిభాభారతి తల్లి లీలావతి సంతకవిటి మండలంలోని కావలి సర్పంచ్‌గా వ్యవహరించారు. ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్నారు.


నారాయణ


నరసయ్య


ప్రతిభాభారతి


పున్నయ్య

పూల 'దండ'యాత్ర

- జోరందుకున్న వ్యాపారం

(శ్రీకాకుళం ఆంధ్రజ్యోతి)

ఎన్నికల పండుగ చిరు వ్యాపారులకు ఊతమిచ్చింది. నామినేషన్లు, ప్రచార ఘట్టంలో పూల వ్యాపారం జోరందు కుంది. ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయడానికి ర్యా లీగా వెళ్లిన నేతలకు పూల దండలు వేయడానికి అభిమానులు, కార్యకర్తలు ఎగబడ్డారు. ముందుగానే పూల దండలకు ఆర్డర్లు ఇచ్చి సిద్ధం చేసుకున్నారు. నామినేషన్ల ర్యాలీలు ముగియడంతో ప్రచా రానికి వెళుతున్న అభ్యర్థులకు గ్రామాల్లో పూల దండలు వేసి అభిమానం చాటుకుంటు న్నారు. ఇక జిల్లా స్థాయి నాయకులు వచ్చినా, పార్టీ అధినేతలు వచ్చినా కార్యకర్తలు పూల దండలు, గజమాలలు వేసి కేరింతలు కొడుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగి యడంతో అభ్యర్థులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందిస్తున్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సైతం పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. పువ్వులు సిద్ధం చేసి అమ్మడానికి ఎదురు చూసే పరిస్థితి లేకుండా వ్యాపారులకు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ దండలు, పువ్వులు తెప్పించుకుంటున్నారు. ఎన్నికలు ముగిసే వరకు పూల వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు సంబర పడుతున్నారు. అమ్మకాలు పెరగడంతో స్వల్ప లాభానికే విక్రయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత విజయం సాధించిన వారి విజయోత్సవ ర్యాలీ వరకు తమకు వ్యాపారం బాగానే సాగుతుందని పూల వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.



హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు?

(శ్రీకాకుళం ఆంధ్రజ్యోతి)

'హలో.. మన దగ్గర ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి? ఈసారి ఎవరు గెలుస్తారు? జిల్లాలో ఎన్ని సీట్లు వస్తాయ'ంటూ దేశ, విదేశాలు, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారాన్ని తెలు సుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో బంధువ ర్గాలకు ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ఎక్కువగా తెలంగాణ నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితో పాటు ఉద్యోగం, చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపు, ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లా వాసులు కూడా పక్క జిల్లాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి అక్కడి రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి ఫోన్లలో రాజకీయాలపై ఆసక్తికరంగా చర్చించుకోవడం గమనార్హం.





ఈసీకి ఓ లెక్కుంది

- ఖర్చు తక్కువ చూపుతామంటే కుదరదు

(నరసన్నపేట)

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చులు తక్కువ చేసి చూపుతామంటే కుదరదు. ప్రస్తుత ధరలను బట్టి ఎన్నికల కమిషన్ దేనికి ఎంత వ్యయమవుతుందో ఓ లెక్కను సిద్ధం చేసుకుంది. ఈ లెక్క ప్రకారం అభ్యర్థులు తమ ఖర్చులను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారమంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అభ్యర్థి వెంట అనుచరులు వస్తారు. ప్రచారానికి వెళ్లడానికి వాహనం, అనుచరుల భోజన సదుపాయాలు చేయాల్సిందే. మరో వైపు సభలు, ర్యాలీలు చేస్తే మరింత వ్యయం. వాటికి సంబంధించిన లెక్కలను ఈసీకి అభ్యర్థులు చూపాల్సి ఉంటుంది. వాటర్ ప్యాకెట్ నుంచి సాంబారు ఇడ్లీ, చికెన్ బిర్యానీ, ఎక్కిన వాహనం, పెట్టిన మైక్, కట్టిన బ్యానర్, ఎగిరిన జెండాకు లెక్కలను పక్కాగా ఈసీకి చూపించాల్సిందే. అభ్యర్థుల వ్యయ పరిశీలనకు మండల, నియోజకవర్గ స్థాయిలో ఈసీ పరిశీలకులను నియమించింది.

అభ్యర్థుల వ్యయ పరిమితి..

ఎన్నికలల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిమితిని విధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.90 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఎమ్మెల్యే అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షల వ్యయం చేసుకోవచ్చు. ఎన్నికల్లో ఈసీ పరిమితి కంటే ఎక్కువగానే అభ్యర్థులు ఖర్చు చేస్తారనేది బహిరంగ రహస్యం. ఈసీకి లెక్కలు మాత్రం పరిమితి కంటే కనీసం ఐదారు లక్షల రూపాయలు తక్కువగానే చూపిస్తారు. ఎన్నికల లెక్కలు రాయడంలో ప్రతి నియోజకవర్గంలో ఆరితేరిన చిత్రగుప్తులు ఇందుకు ప్రత్యేకంగా ఉన్నారు. వారి ద్వారానే అభ్యర్థులు ఈసీకి ఇచ్చే లెక్కలను రాయిస్తారు.

ఇలా ఖర్చు చేయాలి..


కోలాటానికి రూ.5000, డ్రమ్స్ లేదా బ్యాండ్ రూ.1000, లైట్స్ రూ.300 (రోజుకు లెక్కన), ఎనిమిది అడుగుల జెండా రూ.1500, వీడియోగ్రాఫర్‌కు రూ. 5000, పువ్వులకు రూ.350, సౌండ్ బాక్స్‌లకు రూ.2000, పూల బోకేకు రూ.500, కరపత్రాలు వందకు రూ.600, బిస్కెట్ ప్యాకెట్‌కు రూ.40, వెజిటేరియన్ భోజనం రూ.100, నాన్ వేజ్ భోజనం లేదా బిర్యానీ రూ.150, పూరి రూ.40, టీ రూ.10, బస్సుకు రూ.20,000, వివిధ వాహనాలకు వివిధ రేట్లు ఉన్నాయి. డ్రైవర్‌కు రోజుకు భత్యం రూ. 520.. ఇలా ప్రతి దానికీ ఈసీకి ఓ లెక్క ఉంది. దానిని బట్టి ఖర్చులు సమర్పించాల్సి ఉంటుంది.



కోర్టు తీర్పులతో ఎన్నికల సంస్కరణలు

హిరమండలం: సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు దేశంలో ఎన్నికల సంస్కరణలకు నాందిపలికాయి. 2013లోనే ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన మూడు తీర్పులు వెలువడ్డాయి. దీంతో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పెరగడంతోపాటు ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగింది.

- డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి కేసులో సుప్రీంకోర్టు 2013లో ఇచ్చిన తీర్పుతో ఓటరు తాను ఓటు వేశాక ఓటు వేసిన అభ్యర్థి వివరాలను చూసుకునేలా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీ ఏటీ) యంత్రాన్ని అమర్చారు.
- 2013లో పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పులతో ఎన్నికల నిర్వహణలో మరో రెండు కీలకమైన మార్పులను తీసుకువచ్చారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే ప్రతికూలమైన ఓటు వేసేలా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో నాన్ ఆఫ్ ద ఎబోవ్ (నోటా) బటన్‌ను ఏర్పాటు చేశారు. ఇదే కేసులో పార్లమెంట్, శాసనసభలకు పోటీ చేసే అభ్యర్థి నేర చరిత్రతో పాటు అభ్యర్థి, జీవిత భాగస్వామి, పిల్లల ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు తదితర వివరాలతో కూడిన ప్రమాణ పత్రాన్ని తప్పనిసరిగా వెల్లడించాలిని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ మేరకు సదరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు సమయంలో వీటన్నింటిపై ప్రమాణ పత్రాలను సమర్పిస్తున్నారు.



సీనియర్ ఓటరు

మంచి చేసే నాయకులనే గెలిపిద్దాం

పలాస: అన్యాయాలు, అరాచకాలకు పాల్పడే నాయకులను నమ్మకూడదు. ఇలాంటి నాయకులు ఎన్నికల్లో పోటీ చేస్తే బుద్ధి చెప్పాలి. ఎన్నికలంటే అపహాస్యంగా మారుతున్న ప్రస్తుత కాలంలో విలువల కలిగిన నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు మంచి చేసే నాయకులను ఓటేసి గెలిపిస్తేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

-గాలి కృష్ణారావు, ఉదయపురం, పలాస మండలం, సీనియర్ ఓటరు




పీపుల్స్ మేనిఫెస్టో

పంటల ధర రైతే నిర్ణయించాలి

నరసన్నపేట: రైతులు పండించే పంటలకు వ్యాపారులు ధరలు నిర్ణయిస్తున్నారు. వారి చెప్పిన ధరలకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. అలాకాకుండా రైతులు పండించే ధాన్యం, పప్పుదినుసులు, కూరగాయలు అమ్ముకునే విధంగా తగిన సౌకర్యాలు కల్పించాలి. పంటల ధర రైతే నిర్ణయించాలి. మార్కెట్‌లో దళారులు లేకుండా సరైనా సదుపాయాలను కల్పించాలి. పండే పంటలను నిల్వ చేసుకునే విధంగా గిడ్డంగి సౌకర్యాలు ఉండాలి.

-బైరి తవిటియ్య, రైతు, తామరాపల్లి, నరసన్నపేట మండలం



మెజారిటీ ఓట్లు నోటాకు పోలైతే..

మీకు తెలుసా?

గార:ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులలో అధికంగా ఓట్లు పోలైన వారు గెలిచినట్టు ప్రకటిస్తారు. పోలైన ఓట్ల లో అత్యధికంగా నోటాకు పడితే... ఎవరు గెలుస్తార న్నది అందరిలో ఉన్న ప్రశ్న. నోటాకు ఎ క్కువ ఓట్లు పోలయ్యాయంటే.. పోటీ చేసిన వారిలో ఏ ఒక్క అభ్యర్థీ ఓటర్లకు నచ్చలేదన్నదే దానర్థం. అంటే పరోక్షంగా అభ్యర్థులందరూ ఓడినట్టే లెక్క. అదే న్యాయమని చాలా మంది అభిప్రాయ పడతారు. ప్రస్తుతం అమలు లో ఉన్న నిబంధనలు వేరే విధంగా చెబుతు న్నాయి. నోటాకు అధికంగా ఓట్లు పోలైన సందర్భాల్లో, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోకుండా... ఆ ఓట్లన్నిటినీ రద్దయినవి గానే ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. నోటా తరువాత అత్యధింగా ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్టు ప్రకటిస్తారు.

ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా..

- కూటమి మేనిఫెస్టో విడుదల
- అధికారంలోకి వస్తే .. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ
- నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి
- ప్రత్యేక ఎంప్లాయిమెంట్ జోన్‌ల ఏర్పాటు
- ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- ప్రతివిద్యార్థికీ ఏడాదికి రూ. 15వేలు
- వడ్డీలేకుండా డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు రుణం
- సామాజిక భద్రత పింఛన్ల పెంపు
- అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టోపై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని వర్గాలకూ సమప్రాధాన్యమిస్తూ మేనిఫెస్టోను రూపొందించ డంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు ప్రజావ్యతిరేక పాలనను వైసీపీ అందించింది. కొత్తకొ త్త చట్టాలను తీసుకువచ్చి బలవంతంగా ప్రజలపై రుద్దేందుకు యత్నించింది. వీటికి విరుగుడుగా, భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలకు భరోసానిచ్చేలా, వారి ఆందోళనలను దూరంచేసి ప్రశాంత జీవనం గడిపేలా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ మంగళవారం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశారు. వెనువెంటనే ప్రజల్లోకి మేనిఫెస్టో వెళ్లిపోయింది. ప్రతిఒక్కరూ ఈవిషయమై చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసీపీ తీసుకువచ్చిన చట్టాలపై భయం ఉండదని సామాన్యులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దును చేస్తామడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోలో కొన్ని అంశాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. వృద్ధాప్య పింఛన్ రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ. 6వేలకు పెంపు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ. 1500 చొప్పున ప్రతి నెలా చెల్లింపు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. యువతకు 20 లక్షల ఉద్యోగాలు. నిరుద్యోగులకు రూ. 3వేలు నిరుద్యోగభృతి. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఒక్కో బిడ్డకు రూ.15వేలు చొప్పున ప్రతి ఏడాది అందజేత. ప్రతీ ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ. ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20వేలు పెట్టుబడి సహాయం.



వలంటీర్లకు గౌరవ వేతనం నెలకు రూ.10వేలు. ఉచిత ఇసుక. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ. భూ హక్కుచట్టం రద్దు. ప్రతి ఇంటికీ ఉచిత ట్యాప్ కనెక్షన్. బీసీ రక్షణ చట్టం. పూర్ టూ రిచ్ పథకం. చేనేతకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితం. విద్యుత్ ఛార్జీలు పెంపుఉండదు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్. పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం. పేదలకు నాణ్యమైన ఇంటి నిర్మాణం. పెళ్లి కానుక రూ.లక్ష. విదేశీ విద్యాపథకం. పండగ కానుకలు. ఇటువంటివి చాలానే మేనిఫెస్టోలో ఉన్నాయి.

రాష్ట్ర పునర్నిర్మాణానికి అద్భుత వరం



కూటమి మేనిఫెస్టో రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎంతో దోహదపడుతుంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా మేనిఫెస్టోను సమతుల్యత ఉండేవిధంగా తీర్చిదిద్దారు. ఏ ఒక్క రంగాన్నీ వదలకుండా ప్రాధాన్యత కల్పించారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అమలుచేసే కొన్ని పథకాలను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు దూరం చేసినప్పటికీ వాటిని పునరుద్ధరించడం గొప్ప విషయం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ మేనిఫెస్టోను తయారుచేయడం జరిగింది.

-కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

చాలాపెద్ద ఊరట



ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఏకంగా ఏడు సార్లు పెంచేసింది. సామాన్యులందరూ అవస్థలు పడుతున్నారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి ఏకంగా మేనిఫెస్టోలో పెట్టారు. సామాన్య కుటుంబాలకు చాలా పెద్ద ఊరట.

- రాయిపిల్లి అర్జున్, అరసవల్లి

జీవితంపై ఆశ కలిగింది



ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల ఉద్యోగాలు.. ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలిస్తామంటున్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూసే నిరుద్యోగులకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగభృతి చెల్లిస్తా మంటున్నారు. ఇంతకంటే యువతకు ఇంకేం కావాలి? నిరుద్యోగులందరికీ జీవితంపై ఆశ కలిగినట్లయింది.

- దవళ సోమశేఖర్, సరుబుజ్జిలి

ఆనందంగా ఉంది



వ్యవసాయానికి 9 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ ఇస్తామనడం సంతోషకరం. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, సోలార్ పంపుసెట్లు, మిగిలిన విద్యుత్ ప్రభుత్వం కొనుగోలు చేయడం మంచిదే. దళారుల దోపిడీని అరికట్టేందుకు ఏపీఎంసీ యాక్ట్ పటిష్టంగా అమలు చేస్తే.. రైతులకు ఇంతకుమించి ఇంకేంకావాలి. అన్నదాతలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. వారికి ఎంతో మేలు చేసేలా మేనిఫెస్టోను తయారు చేయడం సంతోషంగా ఉంది. రైతులు, భూయజమానులకు భీతిగొలిపే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌యరద్దు చేస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది.

-రెయ్యి జానకీరావు, బెల్లుపడ గ్రామం

చంద్రబాబు రైతు పక్షపాతి



రైతులకు ఏడాదికి రూ. 20వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు రైతు పక్షపాతి. రైతు బాగుంటేనే అందరూ బాగుంటారు. పెట్టుబడి కోసం ఆందోళన లేకుండా ఆదుకోవడమన్నది చిన్న విషయంకాదు.

-ఎండ అప్పలనాయుడు, వంజంగి గ్రామం, ఆమదాలవలస మండలం

ముస్లింలకు ప్రయోజనం కలగనుంది



ముస్లిం మైనార్టీలకు యాభై ఏళ్లకే పింఛన్‌తో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. మసీదుల నిర్వహణకు ప్రతి నెలా రూ. 5వేలు, హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ. 1లక్ష సహాయం చేస్తామని ప్రకటించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తామంటున్నారు. ఇటువంటి పథకాలు మైనార్టీలకు ఎంతో ప్రయోజనకరం.

-అబ్దుల్ రజాక్, శ్రీకాకుళం

సామాన్యులకు భద్రత లభిస్తుంది



టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చంద్రన్న బీమా పథకం అమలు చేశారు. ఆ తర్వాత అమలు కాలేదు. మళ్లీ ఇప్పుడు పునరిద్ధరస్తామంటున్నారు. సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. ఈ పథకాలతో సామాన్యులకు భద్రత లభిస్తుంది.

-అలపాన గోవింద్ రెడ్డి, శ్రీకాకుళం

ఉపశమనం లభించినట్లు ఉంది



ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకే వరాలు అధికంగా ఉన్నాయి. ఏడాదికి ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తే ఆర్థిక భారం నుంచి కొంత ఉపశమనం లభించినట్లవుతుంది. ఆడబిడ్డ నిధి ద్వారా రూ.1500 నెలకు ఇస్తామంటున్నారు. ఆపై తల్లికి వందనం ద్వారా పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ బడికి పంపినందుకు రూ.15వేలు చొప్పున అందిస్తామంటున్నారు. మహిళాసంఘాలకు వడ్డీలేకుండా రూ.10లక్షలు వరకు రుణం ఇస్తామనడం ఆనందంగా ఉంది. పెళ్లికానుక కింద లక్ష రూపాయలు అందించడం వల్ల పేదలకు ఎంతో భరోసా కల్పించనట్లు అవుతుంది.

-దుప్పల పద్మావతి, పూజారిపేట, ఆమదాలవలస

టీడీపీలో చేరిన 17 మంది వలంటీర్లు

టెక్కలి, ఏప్రిల్ 30: కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడకు చెందిన 17మంది వలంటీర్లు పదవులకు మంగళవారం రాజీనామా చేసి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ మేరకు పైల త్రివేణి, పైల వినోద్, మడ్డి శ్రీను, దివ్వల శారద, పైల ప్రశాంత్, మెండ సింహాచలం, పట్ట సురేష్, లింగం నిర్మల, సోమేష్, మడ్డి రాము, సతివాడ వెంకటరమణ, రావాడ కృపాకుమారి, బోర మాధవి, పట్ట ధనలక్ష్మి, మెండ లలిత, చిన్నాల హేమలత, వాన రామకృష్ణలకు కండువాలు వేసి ఆహ్వానిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లపాటు గొడ్డుసేవలు చేయించుకొని ఇప్పుడు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకుల నియంతృత్వ ధోరణి వల్ల మూకుమ్మడిగా రాజీనామా చేసి స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, దోమ మోహన్, సర్పంచ్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వలంటీర్లు

ఏమిటీ 'శిక్ష'ణ

- ఆహారం లేదు.. తాగు నీరు కరువు
- ఇరుకు గదుల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ
- కాశీబుగ్గలో ఉపాధ్యాయుల అవస్థలు



కాశీబుగ్గ ఉన్నతపాఠశాలలో ఆర్డీవోతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ, ఏప్రిల్ 30: కాశీబుగ్గలో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఉన్న తాధికారులు ఆహారం, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పిం చకపోవ డంతో ఉపాధ్యాయులు అవస్థలకు గురయ్యారు. ఇక్కడ శిక్షణకు వచ్చిన కొందరు ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో భోజనం అందక ఆకలితో అల్లాడిపోయారు. మంగళవారం కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో ఈనెల 13న జరగనున్న పోలింగ్‌పై శిక్షణకు మండలాలు నుంచి పీవోలు, ఏపీవోలు 700 మంది హాజరయ్యారు. వీరికి ఇరుకు గదుల్లో కూర్చో పెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ నిర్వహించారు. దీంతో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నం సుమారు 100 మందికి భోజనం అందలేదని, శిక్షణకు ఎంత మంది వస్తున్నారో ముందుగా తెలుసుకుని భోజనం సౌకర్యం కల్పించాల్సిఉందని ఉపాధ్యాయులు తెలిపారు. విడతలుగా తీసురావడంతో చాలా మందికి భోజనం అందలేదని ఆందోళన వ్యక్తంచేశారు.ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో భరత్‌నాయక్ పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయులకు నచ్చజెప్పారు. ఇలా అయితే శిక్షణకు హాజరుకాబోమని ఉపాధ్యాయులు తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఆర్డీవో హామీ మేరకు ఉపాధ్యాయులు శాంతించారు.ఆర్డీవోతో పాటు తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు,రెవెన్యూ అధికారులు ఉన్నారు.



భోజనాలు లేక అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు

వారు సీతయ్యలు

- ఎవరి మాటా వినరు..

(శ్రీకాకుళం ఆంధ్రజ్యోతి): అవును.. నిజమే. వారంతా సీతయ్యలే... ఎవరి మాటా వినరు.. వారు నమ్మిందే వేదం.. వారంటే కొందరికి ఇష్టం.. మరికొందరికి కష్టం. అయినవాళ్లకు అండగా ఉంటారు.. కానివాళ్లకు మాత్రం గుదిబండగా తయారవుతారు. ప్రతి ఎన్నికలలోనూ వీరు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు. వారే సంప్రదాయ ఓటర్లు...ఎన్నికల వేళ.. వారికి ఎంతగానో ప్రాధాన్యం ఉంటుంది. నియోజకవర్గంలో తమ బలమేంటో నాయకులు లెక్కలు వేసుకున్నపుడు వీరిదే సింహభాగం. పార్టీలకు అండగా... పెట్టని కోటగా ఈ ఓటర్లే తుది ఫలితాలపై ప్రభావం చూపుతారు. అరుదైన సందర్భాలలో తప్పితే వీరి నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదు. ఏళ్లకు ఏళ్లు ఒకే పార్టీని నమ్ముకుంటూ ఆ పార్టీకే పట్టం కడతారు. వీరి విషయంలో దేవుడొచ్చి చెప్పినా వినరని జిల్లాలో చాలా నియోజకవర్గ నాయకులకు అనుభవమే. కుటుంబాలకు కుటుంబాలు... వీధులకు వీధులు.. గ్రామాలకు గ్రామాలు... ఒకే పార్టీకి కంచుకోటగా నిలుస్తారు.. ఈ తరహా ఓటుబ్యాంకుకు వ్యక్తిగత కారణం ఒకటైతే పార్టీపై ఉన్న అభిమానం మరొకటి. పార్టీల వల్ల, ప్రభుత్వాల వల్ల లబ్ధి పొందిన వారి శాతమూ ఎక్కువే. వీరి ఓట్లే అభ్యర్థి విజయానికి కీలకం అంటే అతిశయోక్తి కాదేమో. పదవులు పొంది... పార్టీలు మారుతున్న నేటి రాజకీయాలలో ఒక వ్యక్తినో, పార్టీనో నమ్ముకుని ఉండే ఇలాంటి సంప్రదాయ ఓటర్లకు ఉన్న విలువే వేరు.



నగదు పట్టుబడుతోంది..

- ఎన్నికల వేళ అధికారుల ముమ్మర తనిఖీలు
- ఇప్పటి వరకు రూ.1.30 కోట్ల నగదు..
- రూ.1.36 కోట్ల విలువైన బంగారం సీజ్
- రూ.74 లక్షల మద్యం కూడా..
- 459 మంది అరెస్టు

శ్రీకాకుళం క్రైం/, అరసవల్లి: ఎన్నికల వేళ జిల్లాలో అధికారుల ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. దీంతో నగదు, బంగారం భారీగా పట్టుబడుతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.1,30,18,920 నగదును ఎన్నికల అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. అలాగే, 2,901 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,36,80,284 ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే, రూ.14,41,669 విలువైన 26,581 గ్రాముల వెండి కూడా పట్టుబడింది. అదే విధంగా 5509 లీటర్ల సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 85 లీటర్లు, ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 1154 లీటర్ల లిక్కర్‌ను ఎన్నికల తనిఖీ అధికారులు, సెబ్, ఎక్సైజ్ అధికారుల సమన్వయంతో స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించే 77వేల లీటర్ల బెల్లం ఊటల నిల్వలను ధ్వంసం చేసారు. వీటన్నింటి విలువ రూ.74లక్షల వరకు ఉంటుంది. అలాగే రూ.5.36లక్షలు విలువైన 124.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగదు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణా కేసుల్లో ఇప్పటివరకు 459 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 716 కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు జరిగింది. దీనిలో భాగంగా 36 మోటారు సైకిళ్లు, 13 కార్లు, ఒక వ్యాను, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాల విలువ రూ.87లక్షలుగా అధికారులు అంచనా వేశారు. సరైన పత్రాలు లేని కారణంగా 13 సెల్‌ఫోన్లు, 10 చేతి గడియారాలు, 14 చీరలు, 10వేల టీషర్టులు, 2,500 కరపత్రాలను సీజ్ చేసారు. వీటి విలువ రూ.7.5లక్షలుగా నిర్ధారించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఘటనలు 93 చోటు చేసుకోగా, అందులో 34 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 67 మంది ప్రభుత్వోద్యోగులకు నోటీసులు జారీ చేశారు. 39 మందిని సర్వీసు నుంచి తొలగించారు. 17 మందిపై చర్యలు తీసుకోవలసి ఉంది. 7,812 మంది గ్రామ, వార్డు వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంసీసీ నిబంధన లను ఉల్లంఘించిన 26 మంది రాజకీయ నాయకులపై 17 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో వైసీపీ వారిపై 10, టీడీపీ వారిపై 7 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. ● సోమవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.29.50 లక్షల నగదును ఓ వ్యక్తి నుంచి సర్వేలెన్స్ బృందం స్వాధీనం చేసుకుంది.



శ్రీకాకుళంలో బస్సులో రూ.29లక్షలు తీసుకెళ్తుండగా పట్టుబడిన దృశ్యం (ఫైల్)

నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది



జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేస్తున్నాయి. నియోజకవర్గానికి మూడు చొప్పున ఒక్కో బృందంలో ఆరు గురు సిబ్బంది 24 గంటలు పనిచేస్తుంటారు. వీరితో పాటుగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, సరిహద్దు నిఘా బృందాలు కూడా నిరంతరం పనిచేస్తాయి. సరైన పత్రాలు లేకుండా రూ.50వేలకు మించిన నగదును తీసుకువెళ్లరాదని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. జూన్ 6 వరకు నిరంతర నిఘా కొనసాగుతుంది.

-రాఘవేంద్ర మీనా, అసిస్టెంట్ కలెక్టర్



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు

కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం : శ్రీనివాస్‌రెడ్డి

● ఎమ్మెల్యే అభ్యర్థి గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల సమావేశం



ఐక్యత ప్రదర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, కలమట, శ్రీనివాస్ రెడ్డి

పాతపట్నం: కలిసికట్టుగా పనిచేసి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఎన్డీఏ అసెంబ్లీ అభ్యర్థి మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో మంగళవారం క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జీలు, పార్టీ నేతల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయ కులు కార్యకర్తలు విభేదాలు వీడి పార్టీ విజయా నికి కృషి చేయాలన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. ఎంపీ కింజరాపు రామ్మో హన్ నాయుడు మాట్లాడుతూ.. పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారిని ఏ ఒక్కరికీ విడిచే పెట్టేది లేదని, అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామన్నారు. అనంతరం పార్టీ నాయకులతో పార్టీ విజయానికి పాటుపడతామని ప్రమాణం చేయించారు. ఎస్ఎస్‌మణుగులో 100 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు కండు వాలు వేసి ఆహ్వానించారు. మామిడి గోవిందరావు ఎమ్మె ల్యే అయితేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. పైల బాబ్జీ, మధు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీల మనుగడ ప్రశ్నార్థకం

వైసీపీ పాలనలో రాష్ట్రంలో బీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ జంపన వీరశ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావును, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు రాకతోనే రైతన్నలకు మేలు: బగ్గు



నర్సింగపల్లిలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయడం ద్వారా రైతన్నలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణ మూర్తి అన్నారు. మంగళవారం కరగాం పంచాయతీలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి రెండు పంటలు పండేలా కాలువల ఆధునికీకరణ చేస్తామన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తామరాపల్లి గ్రామానికి చెందిన 30 మంది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నేతలు పంగ బావాజీ నాయుడు, శిమ్మ లక్ష్మణరావు, సాధు ఆనంద్, పంగ శ్రీరాములు, టీవీ చంద్ర మోహన్, బీజేపీ, జనసేన నాయకులు బలగ ప్రవీణ్, కిల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** ఈనెల సామాజిక పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా వైసీపీ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. నవతల గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సచివాలయాల్లో సిబ్బంది ఉన్నారని, వారితో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకో వాలన్నారు. అరాచక రాక్షస పాలనకు అంతం పలికి రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని ఆదరించా లని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడు ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవుతాయి: అచ్చెన్నాయుడు



టెక్కలి చేరివీధిలో ప్రచారం చేస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి: వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని, ఈ ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం టెక్క లి మేజర్ పంచాయతీ సోగ్గాడిపేట, చేరివీధి, రెడ్ క్రాస్ వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాలకు దగా చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఓటర్లు బుద్ధి చెప్పాలని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, నేతలు కోళ్ల లవకుమార్, కామేసు, మామిడి రాము, డొంకాన రామకృష్ణ, హనుమంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● **సంతబొమ్మాళి:** జగన్నాథపురం గ్రామం నుంచి 20 వైసీపీ కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: ఎంపీ



కంచిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. శాసనాం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలంటే చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టోతో రాష్ట్రాభివృద్ధి: కలమట

కొత్తూరు: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మేనిఫెస్టోతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. మంగళవారం మాతలలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగ, కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థులు, యువతకు ఈ మేని ఫెస్టోతో మేలు చేకూరుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించే వ్యక్తి చంద్రబాబు అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జిల్లా రైతు అధ్యక్షుడు ఒమ్మి ఆనందరావు, కొమరాపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వంతోనే బీసీ సాధికారత: శిరీష



బీసీ సాధికారత పోస్టర్లు విడుదల చేస్తున్న శిరీష

పలాస/మందస/హరిపురం: ఎన్డీఏ ఉమ్మడి ప్రభుత్వంతోనే బీసీ సాధికారత సాధ్యమని పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మంగళవారం నగర సాధికార సమితి నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ పిండి రామారావు, జిల్లా అధ్యక్షుడు గుర్రం నూకరాజు, నక్కా రామచంద్రుడు పాల్గొన్నారు. మందస మండలం మూలిపాడు గ్రామానికి చెందిన 30 మంది, బసవసాయి గ్రామానికి చెందిన 15 మంది యువకులు, మందసకు చెందిన పలువురు వైసీపీ నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష మందస మండలం బహాడపల్లి, కుంటికోట పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నేతలు భావన దుర్యోధన, డొంకూరు తిరుపతి, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండల క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, వివిధ కమిటీల ప్రతినిధులతో పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలాస ఇన్‌చార్జి చౌదరి బాబ్జి, గోవిందు పాపారావు, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థులతో ఫ్లాష్ మాబ్

అరసవల్లి: ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. విద్యార్థులు పలు నృత్యాలను ప్రదర్శిస్తూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలను ఓటుహక్కు వినియోగంపై చైతన్య పరిచేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

పటిష్టమైన నిఘా ఉంచాలి

పాతపట్నం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మద్యం అక్రమ తరలింపు కాకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని ఎస్ఈబీ ఏఎస్పీ డి.గంగాధర్ అన్నారు. పాతపట్నం సర్కిల్ పరిధి లోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న చెక్‌పోస్టు, మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఐ ఎస్.సాయి, ఎస్ఐలు మహమ్మద్ యాశిన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యులను బీసీల్లో చేర్చిన ఘనత టీడీపీదే: గొండు శంకర్

అరసవల్లి: కళింగ వైశ్యులను బీసీల్లో చేరుస్తామని ఇచ్చిన హామీని వంద రోజుల్లో అమలు చేసిన ఘనత టీడీపీదేనని శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఓ హోటల్‌లో కళింగ వైశ్యుల ఆత్మీక కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించిన వైసీపీ నాయకులు ఇప్పు డు ఓటమి భయంతో తనపై బురద చల్లుతున్నారని, అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. కళింగ వైశ్యులకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కళింగ వైశ్య కులస్థులను ఓబీసీలో చేర్చేందుకు ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘ నాయకులు బోయిన గోవిందరాజులు, పైడిశెట్టి జయంతి, జామి భీమశంకర్, కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, కోరాడ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమి టీడీపీ, జనసేన, బీజేపీ కూట మి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం నగరంలోని 21వ డివిజన్ కర్రావీధి, న్యూ కాలనీ, బాకర్ సాహెబ్‌పేట, 17వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం ఖాయమని, రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. టీడీపీ పరిశీలకుడు చింతల రామకృష్ణ, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రూరల్ మండలం కరజాడ గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు ఉపాధి వేతనదారులకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు.



కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గొండు శంకర్

కూటమితోనే అభివృద్ధి సాధ్యం: ఎన్ఈఆర్

లావేరు: కూటమి విజయంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎచ్చెర్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం విజయనగరం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి మురపాక, గుంటుకుపేట, కొత్తపేట, నక్కపేట, ఆరంగిపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పిస్తానన్నారు. ఎమ్మెల్యే గా కమలం, ఎంపీకి సైకిల్ గుర్తులపై ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల జనసేన సమన్వయకర్త డాక్టర్ విశ్వక్సేన్, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలోకి 90 వైసీపీ కుటుంబాలు

రణస్థలం: ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ నుంచి 90 కుటుంబాలు ఎన్డీఏ కూటమి కి మద్దతు తెలిపాయి. వీరికి ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వర రావు, మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో సాధు గోవిందరావు, ముసలయ్య, కొయ్యాన చిన్నారావు, కారిగ్గి అప్పారావు తదితర కుటుంబాల వారున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పొన్నాడలో కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్ సమక్షంలో మద్దతు తెలుపుతున్న దృశ్యం

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వద్దు: కలెక్టర్

కలెక్టరేట్: ఎన్నికల విధుల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీకాకు ళంలో, ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై మాదిరి పోలింగ్ ఎలా నిర్వహించాలో తెలుసుకోవాలి, పోలింగ్ అయిన తరువాత ఆ స్లిప్పులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. అనంతరం సీఆర్సీ తప్పని సరిగా చేసిన తర్వాతే పోలింగ్ మొదలు పెట్టాలన్నారు. పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే ఏం చేయాలో తెలుసుకోవాలన్నారు. ఈవీఎంలో ఓటు పడిన తరువాత సమస్య ఏర్పడితే రెండో ఈవీఎంను వినియోగించాలని, పోలింగ్ పూర్తయిన తరువాత మొదటి ఈవీఎంతో పాటు రెండో ఈవీఎంను కూడా రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాలన్నారు. కార్యక్రమాల్లో శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఆర్వోలు సీహెచ్ రంగయ్య, లక్ష్మణరావు, ఏఆర్వోలు, సెక్టోరియల్ అధికారులు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ కారును రూపొందించిన బీఆర్ఏయూ విద్యార్థులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారుచేసిన ఎలక్ట్రిక్ కారును వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మంగళవారం ఆవిష్కరించారు. మారుతి 800 కారుకు అధునాతన హంగులు, నూతన సాంకేతిక మార్పులు చేసి ఎలక్ట్రిక్ వాహనంగా మార్చారు. ఐసీ ఇంజన్ పూర్తిగా తీసి, 1000 వాట్ల ఎలక్ట్రికల్ మోటారు నూతనంగా అమర్చి గేర్ బాక్సు సాయంతో నడిపేలా రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీసీతో పాటు ఆ విభాగం కోఆర్డినేటర్ ఎస్.మధులత అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రక్షణ: పరమేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్‌తోనే దేశానికి, రాష్ట్రానికి రక్షణ ఉంటుందని, రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు, ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు కోరారు. ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో అరాచకపాలన చేపడుతున్న వైసీపీ ప్రభుత్వానికి పరోక్ష మద్దతు తెలుపుతున్నారన్నారు. గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని అరాచక పాలనతో ప్రజలు విసుగుచెందారని, యువత ఉద్యోగాలు లేక నిరుత్సాహంతో చెడువ్యసనాలకు బానిసలవుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థులు అంబటి కృష్ణ, సనపల అన్నాజీ రావు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనకు పుంగనూరులో దాడే నిదర్శనం'

శ్రీకాకుళం రూరల్: వైసీపీ అరాచక పాలనకు పుంగనూరులో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయ్య యాదవ్‌పై వైసీపీ నేత, మంత్రి రామచంద్రారెడ్డి దాడి చేయించడమే నిదర్శనమని భారత చైతన్య యువజన పార్టీ శ్రీకాకుళం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోరుబద్ర చంద్రకళ, పానిల ప్రసాద్ యాదవ్ అన్నారు. పెద్దపాడు గ్రామంలో ఉన్న పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. పుంగనూరులో ఓగడిపోతామన్న భయంతోనే వైసీపీ నేతలు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణం పోలీసులు స్పందించి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కాయితి వెంకటరమణ, ధన లక్ష్మి, రాజారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

నందిగాం: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ కోరారు. మంగళవారం అన్నాపురం, దిమ్మిడిజోలల్లో సాయుధ పోలీసు బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి, నందిగాం తహసీల్దార్ వి. పద్మావతి, ఎంపీడీవో జి.శివప్రసాద్, ఎస్ఐ మహ్మద్ అమీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

రైలులో పోలీసుల తనిఖీలు



పలాస: ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేర కు విశాఖపట్నం లైన్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం రైలులో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, ఇతర సరుకులను రైలులో తరలిస్తుం డగా ఎటువంటి చర్యలు చేపట్టాలో ఆర్పీఎఫ్, రైల్వే పోలీసులకు వివరించారు. రైల్వే ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ : రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిన సీఎం జగన్ దళిత ద్రోహి అని, రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని ఆమదాలవలస ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలతో సమావేశాన్ని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రాల చిన బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు ఎల్.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూన రవి కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి రవికుమార్, దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో దళిత, కూటమి నాయకులు పేడాడ సూరప్పలనాయుడు, బొనెల అప్పారావు, కాద అప్పల నాయుడు, తుడ్డలి కృష్ణ, గొల్లపల్లి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు. ● మండలంలోని సైలాడ కుమ్మరిపేట గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు మాజీ సర్పంచ్ జోగి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి కూటమి అసెంబ్లీ అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో పొన్నాడ సింహాచలం, రుప్ప రమణ, కోలా త్రినాథ్, చెంచు రాదమ్మ, జోగి రమణమ్మ తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గార: శాలిహుండం సమీపంలో వంశధార నది మధ్యలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడని ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి బిస్కెట్ రంగు ఫ్యాంట్, తెలుగుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, షర్ట్‌తో ఉరి వేసుకున్నాడన్నారు. వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలి పారు. వివరాలకు గార పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ పరిధిలోని తిమడాం ఫీడర్‌పై ఉన్న గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడ్ ఫీడర్లు విడగొట్టేందుకు ఉదయం 8 నుంచిసాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శ్రీముఖలింగం, అచ్యుతాపురం, కరకవలస, బైదలాపురం, తిమడాం, పర్లాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

1700 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో మంగళవారం ఇరు రాష్ట్రాల పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి సుమారు 1700 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు తెలిపారు. బగడ, బాలేరు ప్రాంతాలతో పాటు ఒడిశాలో అధికంగా సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఈ దాడులు చేశామన్నారు. 370 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఈ ఎస్ఐ ఎ.బేగం, పాతపట్నం సీఐ నల్లి సాయి, ఎస్ఈబీ సీఐలు రామచంద్ర కుమార్, రాజ శేఖర్‌నాయుడు, ఎస్ఐ టి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు పుష్కలమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. ఎంచు కున్న రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, ఈసీఈ విభాగం కోఆర్డినేటర్ ఎస్.హరిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు గాను పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. మంగళవారం బాలికల జూనియర్ కళాశాలలో అధికారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విధులు, బాధ్యతలను వివరించారు.

బెల్లుపడలో కార్డెన్ సెర్చ్

ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలోని బెల్లుపడ గ్రామం 12, 13, 14 వార్డుల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మానుయెల్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బైక్ పత్రాలు, లైసెన్సులు ఉన్నాయో లేవో స్వయంగా పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని 12 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.

హక్కుల సాధనకు మేడే స్ఫూర్తి

పలాసరూరల్: కార్మిక హక్కుల సాధనకు మేడే స్ఫూర్తి అని ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అన్నారు. చినసీలావతి గ్రామంలో మేడే సందర్భంగా మంగళవారం మేడే కర పత్రాన్ని ఆవిష్కరించారు. 138 ఏళ్ల కిందట చికాగో నగరంలో కార్మిక వర్గం పోరాడి సాధించు కున్న దినోత్సవాన్నే మేడేగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కార్పొరేట్ సిద్ధాంతాలకు లోబడి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, వారిపై పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామారావు, జుత్తు ఉమాపతి, పాపారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కంచిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కంచిలి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెద్ద శ్రీరాంపురం, తలతంపరలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం పరిశీ లించారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్ కుమార్ సోనీ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఆర్ఐ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో పాత వాహనం వేలం

గార: అంపోలు సమీపంలోని జిల్లా జైలు ఆవరణలో పాత టాటా వాహనాన్ని మంగళవారం జైళ్ల శాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ సమక్షంలో వేలం వేశారు. కార్యక్రమంలో జైలు సూరింటెండెంట్ ఎస్.నబీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.